# రేపు

(జ్యోతి–భాగ్యలక్ష్మి లాటరీ కథల పోటీలలో కన్సొలేషన్
బహుమతి పొందిన కథ )

బుచ్చిరెడ్డికి వంద ఎకరాల పొలం వుంది.

జానకయ్యకు లక్షలు విలువ చేసే మేడ ఉంది.

సుబ్బిశెట్టి గల్లా పెట్టెనిండా డబ్బు ఉంది.

ఎంకమ్మకు కొడుకున్నాడు. . . .

కాంతమ్మకు మెడనిండా సొమ్ములున్నాయి. కాంతమ్మ చేతులకు బంగారు గాజులున్నాయి. పార్వతమ్మకు ముత్యాల ఒడ్డాణం ఉంది. ఎంకమ్మకు కొడుకున్నాడు.

గుడిసెలు ఎరుపు దుస్తులేసుకొని..... వాకిళ్ళముగ్గులు నవ్వుతో..... మరునాడు గుమ్మాల మావిడి తోరణాలు వూగుతాయి.

తెల్లవారితే పండుగ....

ఊరంతా సందడి.....

తెలుగు నేలంతా సందడి.....

ఎంకమ్మ మొహానికి వెలుగొచ్చింది. ఎంకమ్మ కళ్ళలో మాటిమాటికి ముత్యాలు ఊరుతున్నాయి. ఎంకమ్మకు తన కొడుకు మొగిలయ్యా రేపు పట్నం నుండి వస్తాడని తెలిసింది.

రేపు పండుగ....

నిన్న కూలి దొరకక తిరిగొస్తున్న ఎంకమ్మకు వినాయకరావు కనిపించాడు. పక్కకు ఒదిగి నిల్చుంది.

ఎంకమ్మను ఎగాదిగా చూసి–

''పట్నంలో మీ వోడు కనిపించిండె–'' అని నవ్వి– ''ఉద్యోగం చేస్తాండు– రేపు వొస్తాడ్లే.'' అన్నాడు.

ఆ చల్లని మాట చెప్పిన దొరవారికి చేతులెత్తి దండం పెట్టింది ఎంకమ్మ.

కంటినిండా నిద్రమాని, కడుపునిండా తినడం మాని... కొడుకే సర్వస్వం అని రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడి కొడుకును చదివించింది.

పెద్దపంతులు ''మీ అబ్బాయి చదువులో ఉషారున్నాడు ఎంకమ్మా.'' అని చెబితే సంబరపడింది. ఊరి బడిలో చదువు పూర్తికాగానే పైచదువులకు పట్నం పంపించింది.

అమ్మకుండా మిగిలిన గుడిసె, మట్టికుండలు.... కంచుడు.

షావుకారు కాళ్ళు పట్టుకుంది. అప్పులు చేసింది. అవమానాలు భరించింది. పండుగలు, పబ్బాలను తలపులోనే మిగుల్చుకుంది. నవ్వులను వాయిదా వేసుకుంది. విశ్రాంతిని వాయిదా వేసుకుంది. కళ్ళలో కొడుకునే నిలుపుకుంది. రేపు చెల్లెను వాడే చూసుకుంటాడు అనుకుంది.

''....ఉద్యోగం చేస్తాండు- రేపు వొస్తాడ్లే.''

ఆ చల్లని మాట చెప్పిన దొరవారికి చేతులెత్తి దండం పెట్టింది.

పేరు పేరుని దేవతలకు దండం పెట్టింది.

పెద్దపంతులు ఇంటికిపోయి వారి పాదాలకు మొక్కింది.

''అయ్యా... మా మొగిలిగానికి నౌకరయిండట. వినాయకరావు దొరకు పట్నంలో కల్సిండట...'' ఆ మాట అంటుంటె ఆనందంతో ఎంకమ్మ నాలుక తడబడింది.

''అంతా మీ చలువ అయ్యా...''

''నాదేముంది ఎంకమ్మా... అంతా వాడి కృషి ఫలితం. కష్టపడి చదువుకున్నాడు– వృద్ధిలోనికి వచ్చాడు.'' అన్నారు పంతులుగారు.

''మీరు అచ్చరం ముక్కలుచెప్పి నాకొడుక్కు దారి చూపిండ్లయ్యా.''

''నేను వాడికి చేసిందేమీ లేదు ఎంకమ్మా. నా ధర్మం నేను నిర్వర్తించాను. అంతే- మొగలయ్య ఉత్తరం రాశాడా?''

''లేదయ్యా— అడ కొత్తపనిగదా- ఎట్లున్నదో- తీరిందో లేదో- పండుగకు వొత్తనవి దొరతో అన్నడట...''

''అట్లనా... వచ్చినంక ఒకసారి రమ్మను...''

''నేను చెప్పాల్నా అయ్యా. ఊళ్ళెకు వచ్చిండంటె మిమ్మల్ని కలుపకుంట ఉంటడా.''

''ఇప్పటికైనా నీ కూతుర్ని చదివించు ఎంకమ్మా.''

''వాని ఇట్టం ఎట్లుంటే గట్లనేకాని అయ్యా- నేను వద్దంటానా.''

''పెండ్లి పేరటం అని ఇప్పుడే తొందర పడకు- ఒక సంవత్సరం ఉద్యోగం చేశాక కొంచెం ఆర్థికంగా నిలదొక్కుకొని ఆ ప్రయత్నాలు చేయడం మంచిది...''

''నేను చేస్తనన్నా వాడు చేసుకుంటడా బాంచెను... మీ మాట వాని మాట ఒకటి..'' రెండు చేతులు జోడించి చెప్పింది ఎంకమ్మ.

* * *

మొగిలయ్యకు ఉద్యోగం దొరికిందని విని—

''ఎంత కట్టపడితివక్కా... ఓ పూటతిని ఓ పూట ఉపాసం ఉండి కొడుకును సదివిత్తివి. ఇగ నీ కట్టాలు బాగునై నిన్ను పూవుల్లో పెట్టుకోని సూత్తడే కొడుకు. నువ్వు పడిన గోస మొగిలయ్యకు తెల్వదా...'' అంది ఎంకమ్మతో కూలిపనిచేసే చంద్రమ్మ.

''ఇంగ నీ సంసారం ఒడ్డునపడింది ఎంకమ్మా... పిల్ల గురించి బుగులు పడకు. ఇగ దాని అన్నే దాని సూసుకుంటడు.'' అన్నాడు వెంకటాద్రి.

''నీ పూలు దేవునికి ముట్టినవక్కా...'' అంది పారెమ్మ.

అన్నకు ఉద్యోగం దొరికిందని విని ఆ లేతమనసు ఆనందంతో గంతులు వేసింది. విరగబూసిన మోదుగు కొమ్మలా ఊగింది. పెద్ద చెరువు మత్తడిలా ఎగిసిపడింది.

మా అన్నకు నౌకరయింది— మా అన్నకు నౌకరయింది— అని పదే పదే అనుకుంది.

ఇక సామాన్లు ఇవ్వడానికి షావుకారు ఈసడించడు.

తలకు నూనె లేదని పక్కింటి పుల్లమ్మ వెక్కిరించదు.

చింపుల బట్టల్ని చూసి ఉన్నమ్మలు ఎత్తిపొడవరు. చూపులు బాణాలు వంపరు. సానుభూతి ఈటెల్ని గుచ్చరు.

పెద్దింటి రంగమ్మ కూతురు బంగారమ్మ పట్టుకుచ్చుల లంగా మీదికి నీల మనసు పోలేదు.

షావుకారు చిన్నకూతురు పట్టమ్మ బంగారు పోగులు నీల కళ్ళలో మెదలలేదు.

పొరుగింటి కామాక్షి పట్టా గొలుసులు, జేజమ్మ చేతి కడియాలు, సారెమ్మ చేసే రూపాయికి నాలుగు అరిశెలు నీలకు గుర్తురాలేదు.

నాటేస్తూంటె నడుం నొచ్చి నిల్చున్నందుకు తల్లిపడే తిట్లు గుర్తు కొచ్చాయి.

వడ్డీ ఇవ్వలేదని పాపయ్య తిట్టే బూతులు గుర్తుకొచ్చాయి.

నాలుగేండ్లకింద మూలకు పడిన పలకా, పుస్తకాలు గుర్తుకొఛ్చాయి.

''నేను మళ్ళ బడికి పోత .. మా అన్న నన్ను సదివిస్తడు.''

కూతురి కళ్ళలోని ఆనందాన్ని చూసి ఎంకమ్మ కళ్ళు చెమర్చాయి.

''అవ్వా- నీళ్ళు తేవాః'' అడిగింది నీల.

''తేపో బిడ్డా...''

కుండ తీసుకొని నీళ్ళకు వెళ్ళింది నీల.

ఇదివరకు వాళ్ళ బావి నీళ్ళకు పోతే ఎదురింటి మల్లమ్మ నూరు తిట్టి పోసేది.

ఒక్కోసారి వెళ్ళగొట్టేది.

మల్లమ్మ ఇంటికి నీళ్ళకు పోవాలంటే నరకంలో అడుగు పెట్టినట్టుగా ఉండేది.

కసురుకునేప్పటి ఆమె మొహం గుర్తుకొస్తే నీల జడుసుకునేది.

''మంది కోసం బావి తవ్వుకున్నామా?... అని తిట్టే మల్లమ్మ పంట లిచ్చే పొలాలున్నాయి. పాడిబర్లున్నాయి. వడ్డీకిచ్చే డబ్బుంది. నీలనుచూస్తే కోపం ఉంది. పేద వాళ్ళంటె కొందరికి కోపం. పేద వాళ్ళతో మాట్లాడితే పేదలను తాకితే శని అంటుకుంటుందని భయం.

అలాంటి మల్లమ్మ మొహంమీద నవ్వు లాక్కొని ''నీళ్ళు తీసుకపోనా పెద్దమ్మా...'' అని నీల అడగ్గా తనను పెద్దమ్మా అని పిలిచినందుకు మొహం చిట్లించలేదు సరికదా ''తీసుకో బిడ్డా...'' అంది.

''మీ అన్నకు పట్నంలో నౌకరయిందట కదా?'' అని అడిగింది.

''అన్నతో పట్నం పోతరా... ఇక్కడ్నే ఉంటరా?'' అని అడిగింది.

''మీ అవ్వ శాన కష్టపడ్డది కాదు బిడ్డా!'' అంది.

''ఇప్పుడు దానికేం... కాలుమీద కాలేసుకొని రంగరంగా అనుకుంట బతుకుద్ది.'' అంది.

''కుండ ఎత్తుకుంటవా...ఎత్తనా!'' అని అడిగింది.

''ఆగు బిడ్డా ఇంత చింతకాయ తొక్కు ఏస్త కొంటబోతువు...'' అంది.

''ఓవ్వ రేపు అన్న వచ్చేటేలకి అన్నం కూర వండి పెడ్తనే— షావు కారింటికి పోయి బియ్యం తేనా?'' తల్లిని అడిగింది నీల.

వొద్దుబిడ్డా పాతబాకి అడుగుతాడే అనలేకపోయింది ఎంకమ్మ.

కొడుకు రాగానే తమ తమ బాధలు వాడికి తెలినీకుండా తృప్తిగా భోజనం పెట్టాలని ఆ తల్లి మనసు తహతహ పడుతోంది.

''ఉద్దెర రెండు శేర్ల బియ్యం ఇయ్యమని అడుగుబిడ్డా... ఇయ్యక పోతే నేను ఎవ్వల్నన్న బతిమిలాడి సూస్త తీయి.'' అని చెప్పింది.

బెల్లంమీద వాలే ఈగల్ని, దోమల్ని కొట్టికొట్టి మనుషుల్ని కూడా అలాగే ఈసడించుకోవడానికి అలవాటుపడిన సుబ్బిశెట్టి నీలను చూసి

''ఏంకావాలె పిల్లా... మొహం మీద ఎంత తెలివి కనబడ్తాందె... అన్నకు నౌకరయిందనా?'' అన్నాడు.

''మా అవ్వ రొండు శేర్ల బియ్యం ఇయ్యమన్నది సేఠు.''

''రొండు శేర్లుగాదె నాలుగుశేర్లు తీసుకపో- ఏడికి పోతాయి.''

అసలు బరువు పావు తక్కువ నాలుగు కిలోలు సుబ్బిశెట్టి తరాజు మాత్రం నాలుగు కిలోలని జోకి పోసింది బియ్యం.

బియ్యం వక్కటెచాలా? ఉప్పులు ఏంకావాలన్నా తీసుకపో.'' అన్నాడు సుబ్బిశెట్టి.

నీల మొదట ఆశ్చర్యపోయినా ఆ తరువాత కావలసిన దినుసులు మరికొన్ని తీసుకుంటి.

కాతా పుస్తకం తీసి పద్దు రాసుకున్నాడు సుబ్బిశెట్టి.

అమాంతం తమ బతుకు మలుపు తిరిగినట్లు అనిపించింది నీలకు.

గుడిసెవైపు నడుస్తుంటే కాళ్ళు గాలిలో తేలిపోతున్నాయి.

సుబ్బిశెట్టి దయగల మొహం మొలిచినట్టు తల్లికి చెప్పడానికి ఆ అమ్మాయి వడివడిగా నడవసాగింది.

* * *

పెచ్చులూడిన గోడలకు ఎర్రమట్టి పూసింది ఎంకమ్మ.

ఎత్తుపల్లాల నేల నున్నగా అలికింది.

''పాలు పెరుగు కావాలంటే కొంచెడో ఎంచక్కా-'' ఇంటిదాకా వచ్చి చెప్పిపోయింది ముత్యాలు.

చెలమయ్య వొచ్చి వాళ్ళ చెలక వేరుశెనక్కాయలు పెట్టి పోయాడు. ''అత్తా బావొస్తె కాల్చి పెట్టు-'' అని వరుసలు కలిపాడు.

''తిన్నారా చెల్లె'' ఇటు మాట్లాడుతుంటే ఎటో చూసే రంగమ్మ తానే పలకరించింది.

''నీలక్క ఎక్కడికి పోయింది.''

''మా ఇంటికాడ సుద్దతెచ్చి ముగ్గు వేయరాదు పెద్దమ్మా.''

ఊరు తమను పట్టించుకున్నట్లు అనిపించింది ఎంకమ్మకు.

* * *

ఆ రాత్రి—

''పడుకోవే...'' అని పదే పదే కూతురుని అందేకాని తన కంటికి నిద్రవస్తేగా.

ఎప్పుడు తెల్లవారుతుందా ఎపుడు కొడుకును చూసుకుంటానా అని కళ్ళు ఆత్రుత పడుతున్నాయి.

''కడుపు చిన్నది చేసుకొని కళ్ళు పెద్దవి చేస్కొని చదివిస్తివి.''

''తండ్రి పోయినా ఆలోటు రానివ్వక పిల్లల్ని పెంచితీవి. నీ కష్టాలు బాసినాయి. నువ్వు ఎదురు చూసిన రోజులు వచ్చినయ్. నీ శ్రమ వృధా పోలేదు ఎంకమ్మా.''

ఆ మాటలు ఆమె చెవుల్లో గింగురు మంటున్నాయి. తన కొడుకు ప్రయోజకుడయ్యాడని అందరూ అనడం ఎంకమ్మకు ఆనందంగా ఉంది గర్వంగాను ఉంది.

తూర్పు ఇంకా తెలతెల్లవారకముందే వెలుగు రేఖలు ఇంకా చీకటి ముసుగును పూర్తిగా లాగివేయక ముందే ఎంకమ్మ వాకిలి ఊడ్చి కల్లాపి

చల్లింది. ముగ్గులు పెట్టింది.

నీల అన్నం వండి కూర చేసింది. తలంటి స్నానంచేసి జడ వదులుగా అల్లుకుంది. చేమంతిపూలు పెట్టుకుంది.

''అవ్వా! పొద్దటిబస్సుకు అన్న వచ్చిండేమో సూత్తానే.'' అని వూరి పొలిమేర దగ్గరకు పోయి నిల్చుంది.

ఆ వూళ్ళోకి బస్సురాదు. రెండు మైళ్ళ దూరాన బస్సుదిగి వూళ్ళోకి నడిచి రావాలి.

ఊరి పొలిమేరలో చెరువు గట్టుమీద నిల్చుంటె దూరంగా బస్సుదిగి వచ్చే జనం కన్పిస్తారు.

పొద్దుటి బస్సు వచ్చింది. వెళ్ళింది కాని నీల అన్న మాత్రం రాలేదు.

ఎదురు చూస్తూ అలాగే చెట్టుకానుకొని నిల్చుంది నీల.

వూరు పండుగ హడావిడిలో ఉంది నీల కళ్ళు దారికి హత్తుకపోయాయి.

గుడిసెలో గుండె నిలవక మాటిమాటికి బయటికొచ్చి చూస్తున్నది ఎంకమ్మ.

చూసి చూసి తనూ చెరువు కట్టమీదకొచ్చి నిల్చుంది.

రెండవ బస్సుకూడా వచ్చి వెళ్ళినట్టుంది.

గాజుల వీరయ్య వస్తున్నాడు.

పట్నంనుంచి గాజులు, రిబ్బన్లు తెచ్చి వూరిలో అమ్ముతుంటాడు వీరయ్య.

అతనికి ఎదురు వెళ్ళి.

''వీరయ్య మావా మా అన్న కనిపించాడా?'' అని ఆత్రంగా అడిగింది నీల.

వీరయ్య తలెత్తి నీలను ఎంకమ్మను చూశాడు.

''ఆ....కనిపించాడు.'' అన్నాడు మెల్లగా.

''నౌకరయిందట కదా... మావా.., ఇయ్యాల వత్తానన్నడట.''

''ఎవరు చెప్పిండ్లు తల్లీ! మిమ్మల్ని పరిహాసం చేయడానికి అట్ల చెప్పి ఉంటరమ్మా...'' అని ఆగి ఏదో చెప్పడానికి సంశయించసాగాడు.

''వీరన్నా... నా కొడుకు ఎట్లున్నడో వీరన్నా...'' కంగారుగా అడిగింది ఎంకమ్మ.

''మొగిలయ్యకు నౌకరి దొరకక పిచ్చివాడిలా రోడ్లమీద తిరుగుతున్నాడమ్మా వూరికి పోదాం రమ్మని ఎంత చెప్పినా రానన్నాడు.''

ఆ మాట వినగానే ముందున్న చెరువు అమాంతం లేచొచ్చి మీద పడినట్లయింది. తల్లిని చుట్టేసి బావురుమంది నీల ''ఓ అవ్వా... అన్నా... అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది.

ఎంకమ్మ భారంగా కనులు మూసుకుంది.

తూముల్లాంటి ఆ కళ్ళలోంచి '' రేపు '' కన్నీరై చెంపల మీదికి జారింది.....

***

(జ్యోతి మంత్రి)